లవ్ స్టోరీ

దివ్య గీతం

వత్తిడికి లోనైన భూగర్భం లోని పొరల మధ్య జరిగే రాపిడి వల్ల ఉపరితలం పొరలు ఎలా కంపిస్తాయో, అలాగే ఆమె చూపు వత్తిడికి లోనై సున్నితమైన గుండె పొరల మధ్య జరిగిన రాపిడి వల్ల నా మెదడు లోని పొరలు కంపించి పోతాయని నేనూహించ లేదు.

ఉద్యోగ రీత్యా మా నాన్న సొంత ఊరి నుండి బదిలీ అయి అప్పటికి మూడేళ్ళు అయ్యింది. నేను కూడా అమ్మ నాన్నతో పాటే వుండ డిగ్రీ ఫైనల్ ఇయర్ పరీక్షలు వ్రాసి సెలవులలో మా అవ్వతాత ఇంటికి వెళ్ళాను. మూడు సంవత్సరాల తర్వాత మా సొంత ఊర్లో జరిగిన మార్పుల్ని పరిశీలిస్తూ ఆ రోజంతా గడిపాను.

మరుసటి రోజు అలవాటు ప్రకారం ఉదయాన్నే కసరత్తు చేసేందుకు డాబా మీదికి చేరి నా పనిలో నిమగ్నమయ్యాను. ప్రత్యూష కిరణాలు అక్కడి ప్రకృతికి అందాన్ని అద్దుతున్నాయి. ప్రకృతి అందాన్ని ఆస్వాదిస్తూన్న నాకు ఎక్కడి నుండో సన్నగా సినిమా పాట వినిపించింది.

"గోపెమ్మ చేతిలో గోరుముద్ద రాధమ్మ చేతిలో వెన్నముద్ద..." నా ప్రమేయం లేకుండానే ఆ శబ్దం వెంట నా నేత్రాలు ప్రయాణించి చివరికి గమ్యాన్ని చేరుకున్నాయి. అక్కడ, ఆ ప్రదేశంలో "ఆమె!" నీలి రంగు లంగా, అదే రంగు జాకెట్టు. నిమ్మ పండు శరీరచ్ఛాయ, నీలాకాశానికి మేఘాలు కప్పినట్లుగా తెల్లని వోణి. జలపాతాన్ని మరిపించే విధంగా వదిలేసిన కురులు.

ఆమె ముఖార విందాన్ని చూడాలనే ఆశతో, ఉద్వేగంతో ఎదురు చూసే నా నేత్రాలకు ఆ అవకాశం ఇవ్వకుండా తల వంచుకొని పాట పాడుకుంటూ ముగ్గు వేయసాగింది. ఆమెను చూడాలనే కోరికతో క్షణ క్షణానికి నాలో టెన్షన్ పెరుగుతోంది. నా కంటి నరాలకు అధిక రక్త ప్రసరణ. అప్పుడే నా కనుకూల సంఘటన జరిగింది ఆకాశంలో- మేఘాలను చీల్చుకుంటూ పోతున్న విమానం. ఆ శబ్దానికి ఆమె తలెత్తి పైకి చూసి, యాదృచ్ఛికంగా నా వైపు చూసి పాట ఆపింది. గురి చూసి సంధించి వదిలిన బాణంలా ఆమె చూపు నాకు తగలవలసిన చోటే తగిలింది. తరువాత అదే చూపుతో నవ్వీ నవ్వనట్లు పెదాలు కదిల్చి, చటుక్కున వేస్తున్న ముగ్గు, తీస్తున్న రాగం ఆపి లోపలకు వెళ్ళిపోయింది.

అప్పుడు జరిగింది అక్కడ బ్రహ్మాండమైన విస్ఫోటనం- బయటి ప్రపంచంలో కాదు, నా హృదయంలో ఇన్నాళ్ళూ నా గుండె లోతులలో బంధించబడిన ప్రేమ అనే ఆ విస్ఫోటన లావాలా పొంగి రక్తంలో కలసి నా శరీరంలోని అణువు అణువుకు ప్రసరించింది.

ప్రేమ అనేది మనిషిలో ఎప్పుడు పుడుతుందో, హృదయం ఎవరిని చూసి స్పందిస్తుందో మనకు కాదు గదా- పుట్టించే ఆ బ్రహ్మకు కూడా తెలియదు. మనలోంచే పుడుతున్నా చివరికి మనకు కూడా తెలియని గూఢమైన పుట్టుక!

ఆ డాబా మీద ఎంతసేపు గడిపానో నాకే తెలియదు. చివరికి ఎలాగైతేనేం- ఆమె ఆచూకీ తెలుసుకున్నాను.

ఎదురింటిలో వున్న బ్యాంకు మేనేజరు అన్న కూతురని, మెడికల్ ఎంట్రెన్స్ రాయడానికి వచ్చిందని, రిజల్ట్స్ వచ్చేంత వరకు ఇక్కడే వుంటుందని తెలుసుకున్నాను. ఎంత ప్రయత్నించినా పేరు మాత్రం తెలుసుకోలేకపోయాను. ఎలాగైనా ఆమెతో పరిచయం పెంచుకోవాలని, పెన్ను కావాలనే నెపంతో బయల్దేరాను. కాలింగ్ బెల్ నొక్కాను. కొద్ది సేపటి తర్వాత తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా ఆమె!!- గుండె గొంతులోకి వచ్చినట్లయింది.

"ఎవరండీ మీరు? ఏం కావాలి మీకు? మా బాబాయి ఇంట్లో లేరు?" అంది.

'అమ్మా ఎంత తెలివిగలదానివి? డాబా మీద నన్ను చూసి నవ్వి, సిగ్గుతో ఇంట్లోకి పోయి, ఇపుడు ఎవరండీ మీరు అంటూ ఎంత అమాయకంగా అడుగుతూంది' అని మనసులో అనుకుంటూ-

"నా పేరు ప్రియతమ్! ఎదురింట్లో వున్న నాళ్ళు మా అవ్వతాత, పెన్ను అవసరమై వచ్చానండి, మీ బాబాయి కోసం కాదు" అంటూ నేను పరిచయం చేసుకున్నాను.

"దివ్యా! ఎవరే వచ్చింది?" అంటూ ఇంట్లో నుండి వాళ్ళ పిన్ని కేక.

"ఎదురింటిలో వున్న ప్రియతమ్ పిన్నీ! పెన్ను కోసమట!" వాళ్ళ పిన్నికి జవాబు ఇస్తూ, "వుండండి పెన్ను ఇస్తాను" అని చెప్పి ఇంట్లోకి వెళ్ళింది.

'ఈమె పేరు దివ్య! దివ్యమైన పేరు. రూపానికి తగ్గట్టు' అనుకుంటూ నిల్చున్నాను.

"ఇదిగో పెన్ను, త్వరగా తెచ్చివ్వండి" పెన్ను అందిస్తూ అంది ఆమె. పెన్ను తీసుకొని నేను అక్కడి నుండి వచ్చేశాను.

మరునటి రోజు ఆమె పెన్ను కోసం మా ఇంటికి వచ్చింది. ముప్వల నవ్వడి విని ఫ్రెండ్‌కు లెట్‌రు రాస్తున్న నేను తలెత్తి చూశాను.

"హలో! మీరా! రండి కూర్చోండి" అంటూ కుర్చీ చూపించాను.

కూర్చుంటూ "పెన్ను అవసరముంది, నా పెన్ను ఇస్తే నే వెళ్ళిపోతాను" అంది.

'ఎన్నో పెన్నులు ఇంట్లో వున్న ఆమెకు ఈ పెన్నుతో అవసరముండదు. అంటే కేవలం అందు కోసమే వచ్చిందా, లేక...' నా మనసులో ఎక్కడో చిన్న వెలుగు.

"ఓ! సారీ దివ్య గారు! మీ పెన్ను పోయింది, మీ కభ్యంతరం లేకపోతే ఆ పెన్ను ధర చెప్పండి ఇస్తాను" అన్నాను.

"చూడండి! మీకిచ్చిన పెన్ను మా బాబాయిది! నా పెన్నని మీరు జ్ఞాపకంగా వుంచుకుని వుంటారు" అంటూ ఆగి, నా వైపు సూటిగా చూసి, "అయినా మనస్ఫూర్తిగా నే ప్రజెంటు జేస్తే మీరుంచుకున్నా బాగుంటుంది" అన్నది. ఆమె లాజిక్‌కి మరో మాట కూడా మాట్లాడలేక, దాచిన పెన్నును తెచ్చి ఇచ్చాను. ఆ పెన్ను తీసుకొని దివ్య వెళ్ళిపోయింది. ఆమె మాట, హుందాతనపు ప్రవర్తన, స్నేహం, సభ్యత కలగలిసిన తత్వం నన్ను మరీ ఆకర్షించాయి.

ఇంతితై వటుడింతయై అన్నట్టుగా మా ఇద్దరి మధ్య పరిచయం దినదినాభివృద్ధి అయి బహువచనం నుండి ఏకవచనం వరకు వచ్చేసింది.

ఆ రోజు ఎంట్రెన్సు ఫలితాలు ప్రకటించారు. దివ్యకు ర్యాంకు వచ్చింది. అందుకు స్నేహితురాలిగా

రచయిత చిరునామా
ముల్లా రఫీ
S/o. ముల్లా హనీఫ్, గాంధినగర్,
వెలుగోడు (పోస్టు) కర్నూలు (జిల్లా) 518 533

సంతోషించాలా, ఆమె ఇక ఇక్కడ వుండదని ప్రేమి. కుడిగా బాధపడాలో తోచక ఆమె ఎదుట అలాగే నిలబడిపోయాను.

దివ్య మాత్రం చాలా సంతోషంతో అడిగి మరీ అభినందనలు చెప్పించుకుంది. ఫలితాలను ప్రకటించిన రెండవ రోజున దివ్య ఊరికి ప్రయాణమై చెప్పి పోవడానికి ఇంటికి వచ్చింది

"ప్రియతం, ఇదిగో పెన్ను. మనస్ఫూర్తిగా నేనే ప్రజెంట్ చేస్తున్నాను. నా జ్ఞాపకంగా వుంచు! ఏమిటి ఆలోచిస్తున్నావు, ఈ పెన్ను మా బాబాయిది కాదు, నాదే!" చిలిపిగా నవ్వింది.

"ఆరోజు నీ దగ్గరి నుండి పెన్ను రాబట్టాలని అలా మాట్లాడేశాను. బై... మరి నే వెళ్ళొస్తాను" అంటూ బరువెక్కిన గుండెతో నాలుగు మాటలు మాట్లాడి నా చేతిలో పెన్నుంచి వెళ్ళిపోయింది.

నేను ఇక ఆ ఊర్లో వుండలేకపోయాను. దివ్య వెళ్ళిన మరుసటి రోజే మా అవ్వ తాత ఎంత నచ్చజెప్పినా వినకుండా అక్కడి నుండి వచ్చేసాను. ఎలాగో నెల రోజుల వరకు నా మనసుకు నచ్చ చెప్పుకుంటూ వచ్చాను.ఇక మనసును కంట్రోలు చేసుకోలేక పోయాను.

ఒక తెల్ల కాగితం మీద నా మనసులోని మాటలు పేర్చేందుకు సిద్ధమయ్యాను. ఎన్నో కాగితాలు నలిగి విరిగి చెదిరాక హృదయ బాధకు భాష వచ్చినట్లనిపించింది. తృప్తిగా మరోసారి చదువుకొన్నాను.

దివ్యా!

ఏ విషయాన్నైనా సూటిగా చెప్పగల్గే నేను, ఎందుకో నీకు నా మనసులో మాట సూటిగా చెప్పలేకపోయాను. నీవు ఊరికి పోయే రోజున 'నిన్ను ప్రేమిస్తున్నాను దివ్యా' అనాలని ఎంతో అనిపించింది. కానీ నువ్వు చటుక్కున 'ప్రియతం, ఇన్నాళ్ళూ నిన్ను స్నేహితుడుగా చూసానే కాని, అటువంటి భావంతో ఏనాడూ నిన్ను చూడలేదు. ఒక అమ్మాయి, ఒక అబ్బాయితో చొరవ తీసుకొని మాట్లాడితే అది ప్రేమ అని తీసుకుంటారు మీరు అంటావేమో!. అంత ప్రాక్టికల్ గానే నువ్వు మాట్లాడితే కంపించే నా హృదయాన్ని ఎలా అదుపు చెయ్యాలి? జవాబు ఎలా చెప్పాలో తెలియక, నీ ఎదురుగా నా మనసును విప్పలేక పోయాను.

సృష్టిలో ప్రతి ప్రాణీ ప్రేమతో నిండి వుంది. ప్రతి వ్యక్తికీ ప్రేమించే హక్కు వుంది. ఆ ప్రేమను తెలియజేసే హక్కూ వుంది. నాకు ప్రేమించే హక్కు ఎంత వుందో ఆ భావాన్ని తిరస్కరించే హక్కు నీకూ అంతే వుంది. నిదానంగా ఆలోచించి నిర్ణయం తీసుకో! నీ నిర్ణయం ఏదైనా సరే- ఆ నిర్ణయాన్ని మాత్రం నాకు తెలియజేయి. నీ నిర్ణయం ఎటువైపు వున్నా సరే - అప్పుడూ, ఇప్పుడూ ఎప్పుడూ నా హృదయంలో నీ రూపం, నా హృదయ స్పందన ఆగిపోయేంత వరకు వెలుగుతూనే వుంటుంది.

నీ మనసుని నొప్పించే విధంగా ఎక్కడైనా రాసి వుంటే నన్ను క్షమించేది.

ఇట్లు
ప్రియతమ్

నా తృప్తి తీరే వరకు లెటరు చదివి లెటరుతో పాటే రిప్లయ్ కవరు కూడా వుంచి, ఆమె పేరు మీద మెడికల్ కాలేజీకి పోస్టు చేశాను.

సరిగ్గా వారం రోజులకి దివ్య దగ్గరి నుండి కవరు వచ్చింది. అందుకుంటుంటే నా నిలువల్లా వణుకు. నా రూమ్‌లోకి వెళ్ళి తలుపు గడియ వేశాను. ఏమి రాసిందో అనుకుంటూ వణుకుతున్న చేతులతో కవరు చించి చదవడం మొదలు పెట్టాను.

ప్రియతమ్!

నువ్వు రాసిన లెటరు చదివాను. ఒక్కసారి కాదు, వందసార్లు చదివాను. నువ్వు బరువెక్కిన గుండెతో రాసిన ప్రతి వాక్యాన్ని, బాధతో ఇమిడి యున్న ప్రతి అక్షరాన్ని అర్థం చేసుకొన్నాను. నేనూరికి పోయే ముందు నీ మనసులోని మాటలను చెప్పి వుంటే నేను తప్పనిసరిగా నువ్వు చెప్పిన విధంగానే చెప్పేదాన్ని. కాని, ఇప్పుడు మాత్రం అలా చెప్పలేను. ఎందుకంటే, నిజాయితీగా రాసిన నీ లెటరు చూచి. అందుకే చెపుతున్నాను ప్రియతమ్ -

I Love You.

ఇట్లు
దివ్య

ఆ లెటరు చదివిన తర్వాత నేను అనుభవించిన ఆనందం ఇంతా అంతా కాదు. హిట్లరు ప్రపంచాన్ని జయించివుంటే ఎలా ఆనందపడేవాడో, మొట్టమొదటిసారిగా చంద్రునిపై కాలు మోపినపుడు ఆర్మ్ స్ట్రాంగ్ ఎలా ఆనందించాడో, ఎవరెస్టు శిఖరాన్ని మొదటిసారి అధిరోహించినపుడు ఎడ్మండ్ హిల్లరీ ఎలా ఆనందాన్ని అనుభవించాడో అంతటి మధురానందాన్ని అనుభవించాను నేను.

◆